క్లుప్తంగా

బీసీ రిజర్వేషన్లు పెంచాలి



మాట్లాడుతున్న మోకుదెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు అంజిగౌడ్

పెద్దపల్లిరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ గణన చేపట్టి, బీసీల జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లను పెంచుతూ చట్టసభల్లో తీర్మానించి ఆమోదించాలని సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌడసంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాగిరి అంజిగౌడ్ అన్నారు. పెద్దపల్లి బస్టాండ్ వద్ద 40 రోజులుగా బీఎస్పీ నియోజకవర్గ ఇన్చార్జి దాసరి ఉష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలేదీక్ష శిబిరాన్ని సోమవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. గీత కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బీసీలంతా ఏకమై రాజ్యాధికారం సాధించుకుందామని అన్నారు. నాయకులు శంకర్‌గౌడ్, దేవేందర్‌గౌడ్, విష్ణువర్ధన్, సవిత, బాలకళ్యాణ్‌పంజా, రాజు, వెంకటేశ్, బాబు, దుర్గయ్య, గోపాల్, రియాజ్, శారద, మధు, శేఖర్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

షీటీం, సైబర్ క్రైంపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై వినీత

సుల్తానాబాద్‌రూరల్: షీటీం, సైబర్ క్రైంలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని ఎస్సై వినీత అన్నారు. సుల్తానాబాద్ మండలం భూపతిపూర్ కస్తూర్బా గాంధీ విద్యాలయంలో సోమవారం షీటీం, సైబర్ క్రైంలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు, ఆడవారి పట్ల జరుగుతున్న అఘాయిత్యాలను ఎదుర్కోనేందుకు షీటీం ఉందని, ఎవరైనా సమస్యల్లో ఉన్నప్పుడు వెంటనే హెల్ప్‌లైన్ 1098 కు కాల్ చేయాలని సూచించారు. సైబర్ క్రైంలపై విద్యార్థులు వారి తల్లిదండ్రులను అప్రమత్తం చేయాలని కోరారు. ప్రిన్సిపాల్ స్వప్న, డబ్ల్యూపీసీ గీతాంజలి, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువు శిఖం భూముల కబ్జాకు యత్నం



మట్టి కుప్పలు, బండరాళ్లతో హద్దులు

రామగుండం: కార్పొరేషన్ పరిధిలోని అబాది రామగుండంకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన కొంతమంది స్థానికులు చెరువు శిఖం భూమిలో మట్టి కుప్పలు, రాళ్లతో హద్దులు ఏర్పాటు చేసుకుని కబ్జాలకు యత్నిస్తున్నారు. దీనిపై సంబంధిత రెవెన్యూ అధికారులు స్పందించి బండ రాళ్లతో హద్దులు, మట్టి కుప్పలను తొలగించి చెరువుశిఖం భూమిని పరిరక్షించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

బీ థర్మల్‌లో భద్రతా దినోత్సవం



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఇన్‌చార్జి ఎస్ఈ

రామగుండం: పట్టణంలోని బీ–థర్మల్ విద్యుత్ కేంద్రంలో సోమవారం 52వ జాతీయ భద్రతా దినోత్సవంను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ కేంద్రంలోని ఇంజినీర్ల సమావేశ మందిరంలో జెన్‌కో ఉద్యోగులతో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఇంజినీర్ శంకరయ్య ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉద్యోగులు అరుముళ్ల భూమయ్య, లగిశెట్టి రవి, బొడ్డు యాదగిరి, గుర్రం కుమారస్వామి, నూనె రాజు, శంకర్, అబ్దుల్ నజ్మీ, కొమ్మురాజుల మల్లేశ్, ఇంజనీర్లు, పాల్గొన్నారు.

పార్ట్‌టైం టీచర్లకు న్యాయం చేయండి

మంథని: ఎన్నో ఏళ్లుగా వివిద గురుకులాల్లో సేవలు అందిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని జిల్లా యూనియన్ అధ్యక్షుడు పున్నం అధ్యక్షతన టీచర్లు ఎమ్మెల్యే శ్రీధర్ బాబుకు వినతిపత్రం అందించారు. పనికి తగిన వేతనం ఇచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో సురేశ్, నరసింహులు, లింగయ్య, రాజేశ్, సంతోష్, కుమార్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా రైల్వే అండర్‌బ్రిడ్జి



హరిపురంలో నిరుపయోగంగా రైల్వే అండర్‌బ్రిడ్జి

ఓదెల: మండలంలోని హరిపురం గ్రామ శివారులోని రైల్వే అండర్ బ్రిడ్జి ప్రమాదాలకు కేరాఫ్‌గా మారింది. ఏడాది క్రితం రైల్వేశాఖ నిర్మించిన అండర్‌బ్రిడ్జి నిరుపయోగంగా మారింది. బ్రిడ్జి నుంచి ప్రయాణించాలంటే వాహనదారులు, ప్రయాణికులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. గతంలో సౌకర్యంగా ఉన్న రహదారిని రైల్వేశాఖ అండర్ బ్రిడ్జి తీయటంతో నామ రూపాలుగా లేకుండా పోయింది. ప్రయాణికులు తిరిగి చెడిపోయిన రోడ్డు నిర్మాణానికి మరమ్మతులు చేయాలని పలుసార్లు రైల్వేశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల అండర్ బ్రిడ్జి రహదారి పక్కనుంచి వెళ్తున్న కార్లు, బైక్‌లు అదుపుతప్పి కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. మరికొందరు ప్రాణాలతో బయటపడ్డారు. ప్రయాణికులు, గ్రామస్తులు అందరికీ సౌకర్యంగా ప్రత్యామ్నాయ రోడ్డు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

గుంతను పట్టించుకునే వారేరి?



మూలమలుపు వద్ద భారీగా గుంత

సుల్తానాబాద్: పట్టణంలోని నీరుకుళ్ల వెళ్లే దారిలో మూలమలుపు వద్ద భారీగుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఇటీవల భారీ వాహనంలో గ్రానైట్ రాయి వెళ్తుండగా కింద పడింది. గ్రానైట్ రాయి ఏజెన్సీ వారు రాయిని తీసుకెళ్లి గుంతను పూడ్చి వేయకపోవడంతో ప్రమాదకరంగా మారిందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ప్రమాదకరమైన మూలమలుప వద్ద గుంత పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మూలమలుపు వద్ద ఓదెల, కాల్వ శ్రీరాంపూర్ రహదారి నీరుకుళ్లకు వెళ్లే రహదారి ఉంది. ప్రమాదం జరిగితే పరిస్థితి ఏంటని కాలనీ వాసులు ప్రశ్నిస్తున్నారు.రోడ్లు భవనాల శాఖ అధికారులు వెంటనే రహదారిని సందర్శించి బాగు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



ఆలయానికి వెళ్లే రోడ్డు మధ్యలో కరెంట్ పోల్ ఇలా..

సీసీ రోడ్డు .. మధ్యలో కరెంట్ పోల్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం దేవునిపల్లిలో సీసీరోడ్డులో విద్యుత్ స్తంభాలను తొలగించకుండానే రోడ్డు వేయడం విమర్శలకు తావిస్తోంది. రూ.46 లక్షల నిధులతో సీసీ రోడ్లు వేసేందుకు ఇటీవల ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పనులు ప్రారంభించారు. రోడ్లు వేసేటప్పుడు అడ్డుగా ఉన్న స్తంభాలను తొలగించకుండానే సీసీరోడ్డు నిర్మించడంతో పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. పనులను త్వరితంగా చేయాలనే ఆలోచనతోనే చేపట్టామని, ఈ మార్గంలో ఉన్న విద్యుత్ స్తంభాలన్నింటినీ తొలగిస్తామని సర్పంచ్ కిషన్ తెలిపారు. వీలైనంత త్వరగా స్తంభాలను తొలగించి రోడ్డును సరిచేయిస్తామని పేర్కొన్నారు.

అభివృద్ధి పనుల అనుమతులకు ప్రతిపాదన



మాట్లాడుతున్న మార్కెట్ చైర్మన్ అనంతరెడ్డి

మంథని: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్ అనుమతులు పొందడానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతామని మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి తెలిపారు. సోమవారం మార్కెట్ యార్డులో నూతన పాలక వర్గ సాధారణ సమావేశం నిర్వహించి పలు తీర్మానాలు చేశారు. యార్డులో నిరంతర పర్యవేక్షణకు నాబార్డ్ గోదాం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుకు తీర్మానం చేసినట్లు తెలిపారు. ఇటీవల వల్ల వరదలతో యార్డులోని కార్యాలయ భవనం, విశ్రాంతి భవనం, వేబ్రిడ్జి, వాటర్ ప్లాంట్ మునిగి నష్టం వాటిల్లిందన్నారు. వాటిని మరమ్మతులు చేసి కలరింగ్ చేయించుటకు ప్రతిపాదనలు చేస్తామన్నారు. నూతన ఫర్నిచర్, యార్డులో పనికిరాని ఇనుప వస్తువులు, వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి మార్కెట్ కార్యదర్శి సతీశ్‌కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, సభ్యులు ఉన్నారు.

'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న టీచర్లు

ఎలిగేడు: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని వాసవీ క్లబ్ ఎలిగేడు శాఖ ప్రతినిధులు ఎల్లంకి రాజు, విక్రమ్ అన్నారు. సోమవారం ఎలిగేడు మండలకేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో ఎలిగేడు, సుల్తాన్‌పూర్, ధూళికట్ట ఉన్నత పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు వాటర్ బాటిళ్లు, పెన్నులు, స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో కవిత, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం జీవన్‌రెడ్డి, సీఆర్పీ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వాసవిక్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి లోను కావొద్దని స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ అనిత అన్నారు. సోమవారం ఎలిగేడు, ధూళికట్ట, సుల్తాన్‌పూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో కవిత, కాంప్లెక్స్ హెచ్ఎం జీవన్‌రెడ్డి, సీఆర్పీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే కోరుకంటి చందర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని: నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని, దీని కోసం అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కోరారు. సోమవారం సింగరేణి, మున్సిపల్, ఎలక్ట్రిసిటీ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన కాంట్రాక్టర్ పనులు త్వరగా చేపట్టాలన్నారు. సింగరేణి ఎలక్ట్రికల్ విభాగం పనుల నిర్వహణలో నిర్లక్ష్యం సరికాదన్నారు. తాను ఇంటింటి పర్యటన కార్యక్రమంలో తమ ఇళ్లపై వేలాడుతున్న కరెంట్ తీగలు సమస్యను చూపించారన్నారు. మున్సిపల్ ఆఫీస్ నుంచి పైవింక్లయిన్ వరకు రోడ్ నిర్మాణం, సింగరేణి, ఎన్టీపీసీఎల్ విభాగం రోడ్ సైడ్ పోల్స్ వెంటనే తీసివేయాలన్నారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తా నుంచి జీఎం ఆఫీస్ వరకు 40 ఫీట్ల రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్స్, ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు ముందు నుంచి జీఎం ఆఫీస్ వరకు రోడ్ వన్ సైడ్ స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలో ఓపెన్ జిమ్, సింథటిక్ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలన్నారు. సింగరేణి నుంచి మరో పది ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలన్నారు.నెం.1 కల్లు డిపో నుండి గౌతమినగర్ సెంటర్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు, గౌతమినగర్ రైల్వే ట్రాక్ నుండి ఎన్టీపీసీ రింగ్ రోడ్డు వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు, తిలక్‌నగర్, రమేశ్ నగర్, గౌతమినగర్, మేడిపల్లి, మున్సిపల్ ఆఫీస్ వద్ద జంక్షన్ల అభివృద్ధి చేపట్టాలన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, మున్సిపల్ సింగరేణి , విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

గని కార్మికుల సంక్షేమమే కేసీఆర్ ధ్యేయం

గనికార్మికుల సంక్షేమమే ధ్యేయంగా కేసీఆర్ కారుణ్య నియామకాలు సింగరేణిలో ప్రవేశపెట్టారని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి స్థానిక విశ్వం కమ్యూనిటీ హాలులో సింగరేణి కార్మికులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సింగరేణిలో బొగ్గుగనుల వేలం ఆపాలని బాయిబాట కార్యక్రమం చేపట్టమన్నారు. కార్యక్రమంలో నాయకులు కెంగర్ల మల్లయ్య, గండ్ర దామోదర్‌రావు, జాహిద్‌పాషా, కార్మికులు పాల్గొన్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విధులు

రామగిరి:ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విధులు నిర్వహించడం తప్ప తనకు ఎంపీపీ మీద ఎలాంటి దురుద్దేశం లేదని ఎంపీడీవో ఇనుముల రమేశ్ తెలిపారు. సోమవారం తన చాంబర్‌లో మాట్లాడారు. ఎంపీపీ దేవక్క తన చేసిన ఆరోపణలో ఎలాంటి వాస్తవం లేదని, ఉద్యోగం చేసే తాము రాజకీయం చేయాల్సిన అవసరం ఎందుకు ఉంటుందని ప్రశ్నించారు. ఎంపీటీసీల తీర్మానం మేరకు నిధులు కేటాయించామని, దీనిలో తన ప్రమేయం లేదని వివరించారు. రాజకీయ విషయాల్లో తాము జోక్యం చేసుకోమని ఆయన తెలిపారు. నిధులు వినియోగించకపోవడంతో తనకు జిల్లా కలెక్టర్ మెమో జారీ చేయడం వల్లే ప్రత్యేక సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. సమావేశంలో సూపరింటెండెంట్ సురేశ్ పాల్గొన్నారు.

అంతర్గత కుమ్ములాటతోనే శ్రీధర్‌బాబుపై విమర్శలు

రామగిరి: బీఆర్ఎస్ పార్టీ నాయకుల అక్రమదందాలతో ఏర్పడిన అంతర్గత కుమ్ములాటతోనే ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై అర్థరహిత విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తోట చంద్రయ్య ఆరోపించారు. సోమవారం సెంటినరీకాలనీలోని ఐఎన్టీయూసీ కార్యాలయంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి, ఎంపీపీ దేవక్కకు ఏలాంటి సంబంధం లేదన్నారు. బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న అక్రమదందాలను కప్పిపుచ్చుకోవడం కోసమే ఎంపీపీ దేవక్క దంపతులు ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు తోలు బొమ్మలని ఆరోపించడం సరికాదన్నారు. సమావేశంలో ఎంపీటీసీ కొప్పుల గణపతి, ముస్త్యాల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు సత్యం, నాయకులు పాల్గొన్నారు.

'అక్రమ దందాలు చేసేవారు విమర్శించడమా'

రామగిరి: అధికార పార్టీ అండదండలతో అక్రమ దందాలు చేస్తున్నవారు తమను విమర్శించడం సిగ్గు చేటని ఎంపీపీ ఆరెల్లి దేవక్క ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాము కాంగ్రెస్‌కు అమ్ముడు పోయామని చిల్లర మాటలు మాట్లాడించే వారు ఎంపీటీసీగా గెలవకపోవడం ఆయన కున్న గౌరవాన్ని అర్థం చేసుకోవచ్చని విమర్శించారు. అక్రమ దందాలు చేస్తూ ఎంతమందికి ఉద్యోగాలు అమ్ముకుంటున్నారో ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు.

మోసం చేసిన నాయకులకు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి

గోదావరిఖని: ఎన్నికల సమయంలో హామీలిచ్చి మోసం చేసిన నాయకులను రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని తెలంగాణ లేబర్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గొర్రె రమేశ్ కోరారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. కార్పొరేషన్‌లోని డివిజన్లలో అభివృద్ధి పనులు జరగడం లేదన్నారు. జీడీకే –5 ఓసీపీతో దుమ్ములేచి సమీప కాలనీలపై పడుతోందన్నారు. ఓబీ కాంట్రాక్టర్లు కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతున్నామన్నారు. సమావేశంలో నాయకులు అల్లెపు తిరుపతి, గాజుల రమేశ్, జక్కం కవిత, శివరాం,తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు మహిళా దినోత్సవ సంబరాలు



ధూళికట్టలో మహిళలకు సన్మానం

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం నారాయణపూర్‌లో సోమవారం ముందస్తుగా మహిళ దినోత్సవం నిర్వహించారు. సోమవారం గ్రామపంచాయతీ వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రమేశమహిళలు పాల్గొన్నారు.

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో సోమవారం గ్రామసభను నిర్వహించారు అనంతరం ముందస్తుగా మహిళదినోత్సవాన్ని ఘనంగా నిర్వహి ంచి కేక్‌ను కట్‌చేసి మహిళ ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడి టీచర్లు ,వీవోఏలను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లె కావేరి, ఎంపీటీసీ ఇరుగురాల సావిత్రమ్మ, మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం: మండల పరిషత్ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఐకేపీ ఏపీఎం తులసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలకు రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ సతీమణి ఎల్ఎం ట్రస్టు చైర్మన్ కొప్పుల స్నేహలత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్నేహలతను ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ. జెడ్పీటీసీ పుస్కూరి పద్మజా, సహకార సంఘాల జిల్లా చైర్మన్ బలరాంరెడ్డిలతో పాటు మహిళలు ఘనంగా సన్మానించారు.

గోదావరిఖనిటౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గోదావరిఖని ఆర్టీసీ మేనేజర్ పి.మల్లేశం ఆధ్వర్యంలో మహిళలను, ప్రయాణీకులను సోమవారం ఘనంగా సన్మానించారు.

సుల్తానాబాద్ : సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పూసాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు . పాఠశాల మహిళా ఉపాధ్యాయులు ఉమా రాణి,సుజాత, సుజాత,స్వరూప, వనజ, మధ్యాహ్న భోజన సిబ్బంది, ఉపాధ్యాయులు శాలువాలతో సత్కరించారు.

ఓదెల: మండలంలోని బాయమ్మపల్లెలో మహిళా దినోత్సవంను సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కో ఆర్డినేటర్ రాజు, సర్పంచ్ తొల్పురి కొంరయ్యయాదవ్, మహిళలు పాల్గొన్నారు.

మంథని: మహిళా దినోత్సవం సందర్భంగా మంథని బస్టాండ్‌లో ఆరుగురు మహిళా ప్రయాణికులను సన్మానించి ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎస్టీఐ ఏంజల్, కంట్రోలర్ రాజిరెడ్డి, ఎస్డీఐ గోపాల్, బికే స్వామి, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు కాంగ్రెస్ అండ

పెద్దపల్లిరూరల్: రాష్ట్రంలో ప్రభుత్వం ఊరూరా బెల్టుషాపులకు అనధికార అనుమతులనిచ్చి గీత కార్మికుల ఉపాధిని దెబ్బతీసిందని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు ఆరోపించారు. జిల్లాలో గీత కార్మికులు కలెక్టర్ కార్యాలయం వరకు చేపట్టిన ఆత్మగౌరవ పాదయాత్రకు విజయరమణారావు, బీఎస్పీ ఇన్‌చార్జి దాసరి ఉష తదితరులు సంఘీభావం ప్రకటించారు. ప్రభుత్వం స్పందించి గీత కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని గౌడ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జాగిరి అంజిగౌడ్ డిమాండ్ చేశారు. నాయకులు సారయ్య, అబ్బయ్య, శంకర్, దేవేందర్, కిశోర్, రవి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

తనిఖీల పేరుతో వేధింపులు ఆపాలి

సుల్తానాబాద్: రామగుండం కార్పొరేషన్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాలను తనిఖీల పేరుతో అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారని, అవి ఆపకపోతే సహించేది లేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ ప్రకటనలో హెచ్చరించారు. రామగుండం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న సీడీపీవో పోస్టులు వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అన్ని ప్రభుత్వ పనులు చేస్తున్నప్పటికీ అంగన్‌వాడీ టీచర్లను అధికారులు వేధిస్తున్నారని, టీచర్లను, ఆయాలను ఆందోళనకు గురి చేయడం, టార్గెట్ చేయడం సబబుగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంత మంది అంగన్‌వాడీ టీచర్ల కనుసన్నల్లో అధికారులు ఉండడం సరికాదన్నారు.

ఘనంగా కామ దహనం



రామగుండంలో కామ దహనం

ఓదెల: మండలంలో కామదహన వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా జరిగాయి. మండలంలోని పలు గ్రామాల్లో డప్పు చప్పుళ్లతో కోలలతో జాజిరి ఆటల మధ్య కామహనం వేడుకలను ఉత్సాహంగా జరిపారు. ప్రజాప్రతినిదులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం కామ దహనం వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నపెద్ద తేడా లేకుండా జాజిరి ఆడుతూ పాడుతూ కామదహనం వేడుకగా నిర్వహించారు.

రామగుండం: కార్పొరేషన్ పరిధిలో సోమవారం రాత్రి కామదహన వేడుకను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో పలువురు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన చొప్పరి లచ్చయ్య అనారోగ్యానికి గురై చికిత్స చేయించుకోగా, ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.43000 సీఎం సహాయ నిధి చెక్కును లచ్చయ్యకు, బీఆర్ఎస్ నాయకులు పూరెల్ల గంగయ్య, మద్దెల నరేశ్, సింగిల్ విండో డైరెక్టర్ ఉయ్యాల వెంకటేశ్ అందజేశారు. కార్యక్రమంలో తోట వెంకటయ్య, మల్లయ్య, బుర్ర శ్రీనివాస్, ఎండీ రఫీక్, ఐల రవి,పెసరు రమేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

కాల్వశ్రీరాంపూర్: వరంగల్ జిల్లా పరకాల పట్టణంలో ఈనెల 5 న నిర్వహించిన 31వ ఇంటర్ స్టేట్ ఓపెన్ కరాటే చాంపియన్ అండర్– 10 కటాస్ విభాగంలో మండలంలోని పెగడపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. అక్షిత సిల్వర్, పెండ్లి సుస్మిత, ప్రణీత బ్రాంజ్ మెడల్ సాధించినట్లు కరాటే మాస్టర్ కల్వల రమేశ్ తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ఎంఈవో రాజయ్య, హెచ్ఎం సుదర్శన్, సర్పంచ్ సుజాత, ఎంపీటీసీ నిర్మల, ఉప సర్పంచ్ సుకేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

అంతర్ రాష్ట్ర కరాటే పోటీల్లో ప్రతిభ

మంథని: హన్మకొండ జిల్లా పరకాలలో నిర్వహించిన అంతర్ రాష్ట్ర కరాటే పోటీల్లో మంథనికి చెందిన జపాన్ షిటోరియా కరాటే విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు శిక్షకుడు కావేటి సమ్మయ్య తెలిపారు. కటా,కుమితి విభాగాల్లో అత్యంత ప్రతిభ కనబర్చిన మంథని,ఎక్లాస్‌పూర్ విద్యార్థులు బంగారు, వెండి పతకాలు సాధించారని పేర్కొన్నారు.

కరాటే పోటీల్లో నోబెల్ విద్యార్థుల ప్రతిభ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దకల్వల లోని నోబెల్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు గెలుచుకున్నారు. వరంగల్ జిల్లా పరకాలలో జరిగిన 31వ ఇంటర్ స్టేట్ కరాటే పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను సోమవారం అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ అభినందించారు. పాఠశాల పీఈటీ రాజేందర్, కరాటే మాస్టర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఉర్దూ మీడియం పాఠశాల విద్యార్థినులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఎంఐఎం పార్టీ అధినేత ఒవైసీ సూచన మేరకు పుస్తకాలను ప్రతి ఏటా అందిస్తున్నామని ఎమ్మెల్సీ రియాజ్ ఉల్‌హసన్ ఎఫెంతీ అన్నారు. కార్యక్రమంలో ఎంఐఎం కౌన్సిలర్ కార్తీక్, నాయకులు ముఖీం, ఇమ్రాన్, కలీం, ముజ్జు, సల్మాన్, మంజర్, షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం



శ్రీవేంకటేశ్వర స్వామి రథోత్సవం

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శ్రీ వేంకటేశ్వర స్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తుల శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు.

శ్రీ మల్లికార్జునస్వామి జాతర ముగింపు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ గ్రామ శివారులో రెండు రోజులుగా కొనసాగుతున్న జాతర సోమవారంతో ముగిసింది. రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, అంతర్గాం జెడ్పీటీసీ ఆముల నారాయణ శ్రీ మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. వేకువజామున ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో నడిచి భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. జంగమ పూజారులు మల్లికార్జున చరిత్రను వివరించారు.